కామెడీ కథ

డిఫరెంట్ స్టోరీ

పాపులర్ దర్శకుడు పాపారావ్ సంవత్సరానికి లేదా ప్రేక్షకుల అదృష్టం బాగుంటే రెండేళ్ళకో సినిమా తీస్తూ వుంటాడు. ఆయనగారు ఎప్పుడు సినిమా తీసినా ఆ సినిమా సూపర్ డూపర్ హిట్టయి తీరుతుంది. దీనిక్కారణం పాపారావు తయారుచేసు కునే కథలే.

డిఫరెంట్ స్టోరీలతో సినిమాలు తీసే పాప్ (పాపారావు)ని సినిమా పరిశ్రమలో ఆయనతో అవసరం వున్న వాళ్ళంతా క్రియేటివ్ జీనియస్ అంటూ వుంటారు. ఎక్కువ చేసి చెప్పడం కాదుగానీ, కథలు తయారు చేసుకోవడంలో పాపారావు స్టయిలే వేరని ఆయన స్నేహితులతోపాటు శత్రువులు కూడా ప్రశంసిస్తూ వుంటారు. పాపారావు కథలు తయారు చేసుకునే స్టయిల్ని పట్టుకోవాలని చాలామంది దర్శకులు ప్రయత్నించి, పాపం విఫలమైపోయారు.

ఇలాంటి నేపథ్యంలో ఓ ఫైన్ మార్నింగ్ దర్శకుడు పాపారావు తాను త్వరలో 'బండలాంటి గుండె' అనే సినిమాని తీయబోతున్నానని డిక్లేర్ చేశాడు.

అంతే, ఇండస్ట్రీలో సంచలనం బయల్దేరింది. పాపారావ్ మరో హిట్ కొట్టబోతున్నాడని చిత్రపరిశ్రమలో అందరూ డిసైడైపోయారు. పాపారావు స్నేహితులు సంతోషించారు. శత్రువులు భోరున ఏడ్చారు. పాప్ అలా టైటిల్ ప్రకటించాడో లేదో బయ్యర్స్ సదరు సినిమా రైట్స్ కొనడానికి ఫ్యాన్సీ ఆఫర్లివ్వడం మొదలెట్టేశారు. పాపారావుకున్న క్రేజ్ అలాంటిది మరి.

ఈ బిజినెస్ డీటైల్సన్నీ ఎలా వున్నా, సినిమా ఇండస్ట్రీలో లైట్‌బోయ్ దగ్గర్నుంచి బడా డైరెక్టర్లవరకూ పాపారావ్ తన కొత్త చిత్రానికి ఎలాంటి కథను తయారుచేసుకుని వుంటాడబ్బా అన్న ఇంట్రస్టు టూమచ్‌గా క్రియేటై కూర్చుంది. వీళ్ళతోపాటు సినిమా ఇండస్ట్రీ కోసం బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచించే ఫిలిం జర్నలిస్టుల్లో కూడా పాపారావు తన తాజా చిత్రం కోసం ఎలాంటి కథ తయారు చేసుకుని ఉంటాడా, అది ఏ స్టయిల్లో వుంటుందా అన్న విషయాలు ఎంటనే తెలుసుకోవాలన్న తుత్తర బయల్దేరింది. దాంతో కొన్ని సినిమా పత్రికల జర్నలిస్టులు పాపారావు సినిమా కథకు సంబంధించిన వివరాలు, విశేషాలు తెలుసుకునేందుకు ఎవరిదారిన వాళ్ళు పాపారావును కలవటానికి బయల్దేరారు.

మొదట 'సినీ ధమాల్' పత్రిక ప్రతినిధి రాసేరావ్ దర్శకుడు పాప్‌ని కలిశాడు.

''నమస్తే పాపారావుగారూ...కొత్త సినిమా ప్రకటించారుగా..కంగ్రాట్స్''

''థాంక్యూ..థాంక్యూ..ఇంతకీ మీరొచ్చిన పనేంటో చెప్పేస్తే ఓ పనయిపోద్ది. ఎందుకంటే నేను నా సినిమా గురించి బోల్డంత థింక్ చేయాల్సిన అవసరముంది''

''ఏం లేదు సార్..మీ 'బండలాంటి గుండె' సినిమా కథాంశమేంటో తెలుసుకుందామని వచ్చా.''

''హి..హి..హి..సారీ..అదంతా ప్రస్తుతానికి సస్పెన్స్''

''ఇప్పుడూ, 'బండలాంటి గుండె' అన్నారు కదా! హీరో గుండె బండలాంటిదయితే, దాన్ని కరిగించే ప్రయత్నంలో హీరోయిన్ గుండె కూడా బండయిపోతే, ఆ తర్వాత వారిద్దరి గుండెల్ని కాలం కరిగించడమే ఈ సినిమా స్టోరీనా?''

''హి..హి..హి..సారీ..ఇప్పుడేం చెప్పను''

''అబ్బ..స్టోరీ విషయంలో సస్పెన్స్ మెయింటైన్ చేయాలంటే మీ తర్వాతే ఎవరైనా..వస్తా సార్''

''థాంక్యూ..వెళ్ళి రండి రాసేరావ్ గారూ..''

పాపారావు దగ్గర్నుంచి రాసేరావ్ సెలవు తీసుకున్న అయిదు నిమిషాల తర్వాత 'రాగి తెర' పత్రిక ప్రతినిధి పెన్నేశ్వర్ ఎంతో ఆశగా పాపారావు దగ్గరికొచ్చాడు.

''నమస్కార్ పాపారావుగారూ..మీరివాళ ఎలాగైనా సరే మీ 'బండలాంటి గుండె' సినిమా స్టోరీని మా పాఠకులకు చెప్పాల్సిందే..''

''ఓహ్..మరీ ఇబ్బంది పెట్టేస్తున్నావ్ పెన్నేశ్వర్..అది యమా సీక్రెట్.''

''అర్థంగానీ సార్..మీరు 'బండలాంటి గుండె' అనే టైటిల్ పెట్టారంటే, ఈ సినిమాలో హీరో హీరోయిన్లు ప్రేమించుకుంటే-హీరో తండ్రి, హీరోయిన్ తల్లి తమ తమ బండలాంటి గుండెలతో వీళ్ళ ప్రేమని అంగీకరించరు. అప్పుడు హీరోహీరోయిన్లు ఎంతో శ్రమించి పెద్దవాళ్ళ గుండెల్ని కరిగిస్తారు. ఇదేనా సార్ మీ సినిమా స్టోరీ?''

''సారీ పెన్నేశ్వర్. ఈ సినిమా కథ విషయం తప్ప మరే విషయాన్నయినా మనం ఫ్రెండ్లీగా మాట్లాడుకుందాం. కథ గురించి మాత్రం నన్నేమీ అడక్కు. ప్లీజ్''

''సరే మీరంతగా రిక్వెస్ట్ చేశాక కూడా నేను స్టోరీ వివరాలు అడిగితే బాగోదు. ఇక నేను బయల్దేరతా సార్..ఆల్ ద బెస్ట్''

''థాంక్యూ''

పెన్నేశ్వర్ బయటకెళ్ళిన మూడు నిమిషాలకి 'సినీ అద్భుతం' పత్రిక ప్రతినిధి భజగోవిందం పడుతూ లేస్తూ పాపారావు దగ్గరికొచ్చాడు.

''పాపారావుగారూ...ఇప్పుడు మీ సినిమాలో ఇంటర్వెల్‌లో ఫలానా విధంగా జరిగి, క్లయిమాక్స్‌లో ఫలానా ఫలానా విధంగా జరుగుతుందా?''

''ఇహిహి..నేనేం చెప్పను''

మరో పత్రిక ప్రతినిధి..

బాబి

''టైటిల్‌ని తీవ్రంగా పరిశీలిస్తే ఫలానా సమయంలో ఫలానా సంఘటన జరగడం వల్ల కథలో ఫలానా మలుపొచ్చి చివరకు ఫలానా విధంగా సినిమా ముగుస్తుందా సార్?''

''దయచేసి నన్నేమీ అడగొద్దు..సారీ''

ఇంకొక పత్రిక రిపోర్టర్..

''...దీన్ని బట్టేంటంటే, మీ సినిమా కథ..అదన్నమాట. ఏమంటారు?''

''నో కామెంట్''

ఈ విధంగా ఆరోజు అర్ధరాత్రయ్యేవరకూ ఫిలిం జర్నలిస్టులు రావడం, తలా ఓ రకం కథ చెప్పడం, పాపారావు అంతా విని 'సారీ' చెప్పడం. జర్నలిస్టులు నిరాశగా వెళ్ళడం జరిగింది.

ఈ తంతంతా ముగిశాక పాపారావు దీర్ఘంగా నిట్టూర్చి, హాయిగా స్నానం చేసి బడలిక తీర్చుకుని, సుష్ఠుగా భోంచేసి, పొద్దుట్నుంచీ తాను సినీ జర్నలిస్టులతో మాట్లాడిన గదికి వెళ్ళాడు. ఆ గదిలో తాను సీక్రెట్‌గా పెట్టిన టేప్ రికార్డర్ బయటకు తీసి, రివైండ్ చేసి, జర్నలిస్టులు చెప్పిన కథల్ని వింటూ కాగితం మీద పాయింట్లు నోట్ చేసుకోవడం ప్రారంభించాడు. అలా ఓ రెండు మూడు గంటలు జర్నలిస్టులు చెప్పిన కథలన్నిట్నీ కలిపి, ఫిల్టర్ చేసి 'బండలాంటి గుండె' అనే టైటిల్‌కి సరిగ్గా సరిపోయే బ్రహ్మాండమైన కథను తయారుచేశాడు పాపారావ్.

తాను కథ పూర్తిగా రాసిన ఫైల్‌ను సీక్రెట్ అల్మరాలో దాస్తూ పాపారావ్ మనసులో ఇలా అనుకున్నాడు. 'నేను నా కెరీర్ ప్రారంభించిన దగ్గర్నుంచీ ఇదే టెక్నిక్ అనుసరించి కథలు తయారుచేస్తున్నా. పాపం పిచ్చి ఫిలిం జర్నలిస్టులు ఈ విషయం తెలుసుకోలేక నేను టైటిల్ ప్రకటించిన ప్రతిసారీ వాళ్ళే నా దగ్గరికొచ్చి కథలు చెప్పి, నాకు బోల్డంత హెల్ప్ చేస్తుంటారు. దేవుళ్ళలాంటి ఫిలిం జర్నలిస్టులున్నంతకాలం నా కెరీర్‌కొచ్చిన ఢోకా లేదు.'